క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలిగా ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాములూరు హెచ్ఎంగా సౌభాగ్యలక్ష్మి



హెచ్ఎంగా బాధ్యలు స్వీకరించిన సౌభాగ్యలక్ష్మి

వేంపల్లె : మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా సౌభాగ్య లక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తాళ్ళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగ సుబ్బారెడ్డి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈమె ఇదే పాఠశాలలో 8 సంవత్సరాలు ఉపాధ్యాయురాలుగా పనిచేసి అదే పాఠశాలకు హెచ్ఎంగా వచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక చక్రాయపేట మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు టీవీ రమణ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహులు

వేంపల్లె : ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సీఐ నర్సింహులు తెలిపారు. ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌పై తోపుడు బండ్ల వ్యాపారులకు సూచనలు ఇచ్చారు. అలాగే వాహనాలను తనిఖీ చేసి రికార్డులు లేని వాటికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సులు కలిగిన వారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రైతు బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

వేంపల్లె : స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహం సమీపంలో ఉన్న రైతు బజార్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రైతు బజార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన కూరగాయలను విక్రయించుకునేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో రూ.1.20 కోట్లతో రైతు బజార్‌ను నిర్మించారు. ఇప్పటికి వరకు కడప రోడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్‌ను ప్రజల సౌకర్యార్థం కోసం రైతు బజారులోకి మార్చడం జరిగిందన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయాలు చేసుకునేందుకు మౌలిక సదుపాయాలతో పాటు వర్ష కాలంలో కూడా విక్రయాలు చేసుకోవచ్చునన్నారు. రైతు బజార్ ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నేత కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

4 నుంచి నిరసన దీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప శివానందపురంలో ఇంటిని కూల్చి, నిలువు దోపిడీ చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ 4వ తేదీ నుంచి స్థానిక కలెక్టరేట్ బాధితురాలు పిచ్చమ్మ నిరవధిక నిరసన దీక్ష చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ తెలిపారు.

ఎరువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి

సింహాద్రిపురం : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతోపాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు ముందస్తు పంటల సాగు చేపట్టనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల వేరుశనగ, సోయాచిక్కుడు తదితర పంటలు వేశారు. అయితే పంటల సాగులో భాగంగా అన్నదాతలు ఎరువులు, మందులు అధికంగా వినియోగిస్తారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను అంటగట్టే ఆవకాశముందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ అధికారులు, విజిలెన్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండుసార్లు అలోచించాలని సూచిస్తున్నారు. పంటలకు పురుగు మందులు వాడకంలో అధికారుల సూచించిన వాటినే తీసుకోవాలని, లేదంటే నష్టపోయే అవకాశం ఉంది. దళారులు వద్ద కొనుగోలు చేయొద్దు. నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. కొందరు ఎరువుల వ్యాపారులు దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించవచ్చు. అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు అంటగట్టే ఆవకాశం ఉంది. అన్నదాతల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు వ్యాపారస్తులు సిద్ధంగా ఉంటారని రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తే మోసపోయే ఆ ఉత్పత్తులను అంటగట్టే వారిపై తమకు తెలపాలన్నారు. ముఖ్యంగా అనుమతులులేని దుకాణాలు, దళారుల వద్ద వాటిని కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే ఇస్తున్నారని కొని వాడితే పంట దిగుబడి తగ్గడంతోపాటు భూసారం దెబ్బతింటుంది. కొనుగోలు చేసేటప్పుడు మందుల లేబుళ్లను పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా, స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారనే విషయాలను తెలుసుకోవాలి. కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న పురుగు మందులు

నకిలీ అని తెలిస్తే ఫిర్యాదు చేయండి

గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తుంచి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి, దుకాణం యజమాని సంతకంతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు మందు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి. సంబంధించిన మందులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి ఆవకాశం ఉంటుంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తాం



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే దుకాణా లైసెన్స్‌లు రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణం పేరుతోపాటు యజమాని సంతకంతో కూడిన బిల్లు తప్పక ఇవ్వాలి. పురుగు మందులు తీసుకునేటప్పుడు డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. చదువురానీ వారు తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధా రించిన తర్వాతనే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన ప్రకారమే మందు పిచికారి చేయాలి. లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది. రైతులు మందు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి.

– శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అంకాలమ్మతల్లి

కమలాపురం : మండల పరిధిలోని సముద్రంపల్లెలో వెలసిన పురాతన అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఎల్లంగారి వెంకటసుబ్బారెడ్డి భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

యోగా చేయండి ఆరోగ్యంగా జీవించండి



యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : యోగా చేయండి ఆరోగ్యంగా జీవించాలని యోగా గురువు వెంకట్రామిరెడ్డి తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో మానవ శరీరంపై యోగా ప్రభావం, ప్రయోజనాలు గురించి ఆయన తెలియజేశారు. పలు యోగా ఆసనాలు వేయించి వాటి ఉపయోగాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



సంక్షేమ అధికారి గురుప్రసాదును సన్మానిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సరస్వతమ్మ

పులివెందుల రూరల్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతమ్మ తెలిపారు. పులివెందులకు చెందిన గురుప్రసాదు సాంఘీక సంక్షేమ అధికారిగా ప్రొద్దుటూరులో పనిచేస్తున్నాడు. ఆయన ఆదివారం పదవీ విరమణ కావడంతో పట్టణంలో బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న శ్రీకర్ కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 39 సంవత్సరాలుగా సంక్షేమ శాఖలో వివిధ హోదాలలో వృత్తినే దైవంగా భావించి అందరిమన్నలను పొందారన్నారు. అనంతరం జిల్లా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ అధికారిగా గురుప్రసాదు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గురుప్రసాదు దంపతులను వారు ఘనంగా సన్మానించారు.

దళితులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలి

చింతకొమ్మదిన్నె : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు త్వరలో దళితులు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాతంగి సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం ఆయన దళిత నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పిఠాపురంలోని మల్లా అనే గ్రామంలో దళితులను సంఘ బహిష్కరణ చేసి వారికి అంగడి సరుకులు ఇవ్వకుండా తాగునీటిని నిలిపివేసి గ్రామాల్లోకి వస్తే చంపుతామని బెదిరించారన్నారు. మూడు రోజుల క్రితం గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు దళితులను బహిరంగంగా నడిరోడ్డులోనే స్థానిక సీఐ శ్రీరాములు నాయక్, సీఐ బూట్ కాళ్లతో నొక్కిపట్టి నాలుగు లాటీలు విరిగిపోయే వరకు కొట్టారన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలో దళిత విద్యార్థికి నోట్లో మూత్రం పోసి అనాగరికంగా కొట్టిరన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 11 నెలల కాలంలో వేలాది మంది ఎస్సీల మీద దాడులు జరిగాయన్నారు. వంగలపూడి అనిత దళితురాలు అయినప్పటికీ కనీసం నోరు మెదపడం లేదన్నారు. జమ్మలమడుగులో నాలుగు సంవత్సరాల పసిబిడ్డను రేప్ చేసి అతికిరాతకంగా చంపినా పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు అట్లూరి సుబ్బరాయుడు, ఈజీ గంగయ్య, బియ్యాల లారెన్స్ పాల్గొన్నారు.

నా స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేశారు



అధికార పార్టీ నేతలు వేసిన సిమెంటు రోడ్డు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కమ్మవారిపల్లె పంచాయతీ మజారా దిగువతురకపల్లెలోని తన తండ్రి సయ్యద్ రహమతుల్లాకు చెందిన గ్రామకంఠంలోని తమ స్వంత స్థలంలో అధికార పార్టీకి చెందిన వారు దౌర్జన్యంగా సిమెంట్ రోడ్డు వేశారని బాధితుడు తెలిపారు. కమ్మవారిపల్లె సర్పంచ్ కుమారుడు అలీబాషా, మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి అనుచరులతో ఆదివారం అక్రమంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారని కమాల్‌బాషా తెలిపారు. రోడ్డు నిర్మాణం బూచిగా చూపి పక్కనే వున్న తమ కుటుంబానికి చెందిన స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆదివారం తమ స్థలానికి అడ్డుగా బండలు పాతారన్నారు. సంబంధిత స్థలం కోర్టు కేసులో ఉందని, ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందని చూపించి అడ్డు చెప్పినప్పటికీ, సచివాలయ అధికారులు కానీ, అధికార పార్టీ నాయకులు గానీ పట్టించుకోకుండా మా కుటుంబానికి చెందిన స్త్రీలను కూడా తోసివేశారని ఆరోపించారు. స్థానిక పోలీసులు కూడా అధికార పార్టీకి చెందిన వారికి సహకరిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేస్తూ ఉన్నతాధికారులు అయినా పరిశీలించి దౌర్జన్యకారులపై చర్యలు తీసుకోవాలని కమాల్‌బాషా కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో 1994–95 పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం గురువులను సన్మానించి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 64 మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు పాల్గొన్నారు. ఈ రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీరామిరెడ్డి, నాగిరెడ్డి, టీసీ గంగిరెడ్డి, రాఘవరెడ్డి, విజయప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులు జి.కృష్ణారెడ్డి, వెంకటరమణ, పూర్వవిద్యార్థులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, గంగిరెడ్డి, షబ్బీర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జమ్మలమడుగు రూరల్ : వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించడానికి శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ సంఘం కృషి చేస్తుందని సంఘం వ్యవస్థాపకుడు రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రైవేటు పాఠశాలలో బలిజ మహిళ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షురాలు ఉషాదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగస్తులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.

రేషన్ కష్టాలు తప్పేలాలేవు



పులివెందులలో రేషన్‌షాపువద్ద కూర్చున్న వృద్ధులు



వేములలో రేషన్‌షాపువద్ద రేషన్‌కోసం కింద కూర్చున్న మహిళలు

పులివెందుల టౌన్ : రేషన్‌షాపుల కష్టాలు తప్పేలా లేవు. కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను తొలగించి రేషన్‌షాపుల వద్దే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని జూన్ నెలనుండి చేపట్టింది. రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాయడం చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటివద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చి ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ చేసి వృద్ధులకు, వికలాంగులకు ఎలాంటి కష్టాలు లేకుండా రేషన్ పంపిణీ జరిగేది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్నాక మళ్లీ రేషన్ కష్టాలు తప్పేలా లేవనిపిస్తుంది. రేషన్‌షాపుల్లో బియ్యంతోపాటు చెక్కెర, కందిబేడలు, ఇతర వస్తువులు ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో కందిబేడలు ఇచ్చిన దాఖలాలు లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతి నెల కందిబేడలు ఇస్తారని ఎదురు చూస్తున్నా చెక్కెర ఇస్తున్నారంటున్నారు. పేద ప్రజలకు తినడానికి బియ్యం ఉన్నా పప్పుతినే యోగం లేకుండా పోతోంది. ప్రభుత్వం స్పందించి వెంటనే కందిబేడలు రేషన్‌షాపుల్లో ఇవ్వాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు. ఆదివారం జూన్ 1వ తేదీన రేషన్ పంపిణీ మొదలైంది. అయితే వృద్ధులు రేషన్‌షాపుల వద్దకు పరుగులు తీసి క్యూలో నిలుచున్నారు. వృద్ధులకు, వికలాంగుల పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందేనని పలువురు చర్చించుకుంటున్నారు.

వేములలో..

వేముల : ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్ కోసం వృద్ధులు, మహిళలు పడిగాపులు కాస్తున్నారు. గతంలో ఇంటింటికి రేషన్ పంపిణీ చేయడంతో వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సక్రమంగా అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికి రేషన్ పంపిణీ రద్దు చేయడంతో వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు తిప్పలు తప్పడంలేదు. ఆదివారం నుంచి రేషన్‌ను ఆయా డీలర్లవద్దనే ప్రభుత్వం రేషన్ తీసుకోవాలని ఉత్తర్వులు ఇవ్వడంతో కార్డుదారులు రేషన్‌షాపుల వద్ద క్యూకట్టారు. కొంతమంది క్యూలో నిలబడలేక మహిళలు, వృద్ధులు కింద కూర్చుని రేషన్ తీసుకునేందుకు ఎదురుచూశారు.

రేషన్ షాపుల పరిశీలన



రేషన్‌షాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల టౌన్ : పట్టణంలోని రేషన్ దుకాణాలను ఆదివారం ఆర్డీఓ జి.చిన్నయ్య పరిశీలించారు. రేషన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులకు తూకాలలో ఇబ్బంది లేకుండా చూడాలని డీలర్లకు సూచించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులను తెరిచి ఉంచాలన్నారు. కొలతలు, తూనికలలో ఎలాంటి వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. పంపిణీ వేళలు, నిల్వలు, తదితర అంశాలకు సంబంధించి బోర్డులను రేషన్ షాపుల వద్ద తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ పంపిణీలో సమస్య తలెత్తితే చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని గుంతబజార్, జండా మానువీధి, గాడిచర్లవీధి, పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్ పాల్గొన్నారు.

రేషన్ 15వ తేదీ వరకు ఇవ్వాలి

జమ్మలమడుగు : రేషన్ డీలర్లు లబ్ధిదారులకు ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కచ్చితంగా రేషన్ ఇవ్వాలని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు బియ్యం, చక్కెర, కందిబేడలు ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నాయన్నారు. రేషన్ డీలర్లు తూకాలలో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. వృద్ధులు, వికలాంగులకు డీలర్లు రేషన్‌ను ఇంటి వద్దకు తీసుకువెళ్లి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జూన్ 4వ తేదీన చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతుందన్నారు. కానీ ఇంత వరకు ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు మోసం చేశారన్నారు. సూపర్ 6 పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తామని నమ్మబలికి ఏడాది గడుస్తూన్నా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాన్ మాటలను నమ్మి ఓట్లేసిన ప్రజలను నిలువునా ముంచారన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీలను నిరసిస్తూ 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిఒక్కరు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మిప్రసన్న, భార్గవి, సింహాద్రిపురం మండల నాయకులు శ్రీకాంత్, బిదినంచర్ల బ్రంహ్మానందరెడ్డి, రామ్మోహన్, తొండూరు మండల నాయకులు మల్లేల రవీంద్రనాథరెడ్డి, రామమునిరెడ్డి, శశిభూషన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, సైదాపురం సురేష్, భద్రంపల్లె రామిరెడ్డి, అగడూరు శంకర్, వేముల మండల నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, హేమాద్రిరెడ్డి, లింగాల మండల నాయకులు అంబకపల్లె బాబురెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వేంపల్లె మండల నాయకులు చంద్రఓబులరెడ్డి, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా సంజామల రఘునాథ్‌రెడ్డి రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు కేంద్ర కమిటీ ప్రకటించింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన సంజామల రఘునాథ్‌రెడ్డి పార్టీ అవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేయడంతో అతనికి రాష్ట్రస్థాయి పదవి వచ్చింది. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువజన విభాగంగా వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానన్నారు. తనకు సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.

శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శనలు



చిన్నారుల సినీ నృత్యప్రదర్శన

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఉలిమెల్ల రోడ్డులో ఉన్న శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వారాంతంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పులివెందుల శ్రీరాజ కళా నిలయం డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నృత్యప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులకు డాక్టర్ గంగాదేవి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.